క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల వితరణ

మునగపాక: మునగపాక గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందిన దొడ్డి రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకునేందుకు పూర్వపు విద్యార్థులు తమవంతు సాయం అందజేశారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1994–95లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.15వేల నగదుతో పాటు బియ్యం బస్తాను రామకృష్ణ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కర్రి భాస్కరరావు, పెంటకోట గోపినాథ్, సూరిశెట్టి శివతో పాటు మునగపాక గ్రామ ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

జెండా వందనానికి ఏర్పాట్లు

ఎస్.రాయవరం : మండలంలో జెండా వందనం వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తహసీల్దార్ , మండల పరిషత్, పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, ఆయా గ్రామంలో గల పాఠశాలలో జెండావిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేశారు. కొన్ని కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



అచ్యుతాపురం వీధుల్లో జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టారు.ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయ జెండాలను ప్రదర్శించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు, మేరుగు కాసుబాబు, తంతడి వైస్ ప్రెసిడెంట్ యండపల్లి రాజు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



కె.వెంకటాపురంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లుతో లబ్ధిదారులు

కోటవురట్ల : అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ నిర్వహిస్తున్నారు. తల్లీబిడ్డా క్షేమం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కిట్లు అందజేస్తుండగా లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కె.వెంకటాపురంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ఆకుకూరలు, పప్పు దినుసులతో పౌష్టికాహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చో లబ్ధిదారులకు వివరించారు.

దోమల నివారణ మందు పిచికారి



వాడనర్సాపురంలో దోమల నివారణ మందు పిచికారీ

రాంబిల్లి: వాడనర్సాపురంలో సోమవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ గ్రామంలో నాలుగు డెంగీ కేసులు నమోదు కావడంతో వైద్య , ఆరోగ్యశాఖ అధికారులు దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. జిల్లా మలేరియా అధికారి కె. వరహాల దొర మందు పిచికారీ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారె రామారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో పాయకరావుపేట గవర్నమెంట్ ఐటీఐ కాలేజీలో జాతీయ యువజన దినోత్సవాలు సందర్భంగా హెచ్‌ఐవీ, నివారణ గురించి విద్యార్థులకు లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధి గింజల చిన నరసింగరావు అవగాహన కల్పించారు.

అమరవీరులను స్మరించుకోవాలి



మునగపాకలో అమరవీరులకు వందనం చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి,సర్పంచ్ అప్పారావు



నునపర్తిలో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



రామచంద్రపాలెంలో నాభూమి-నాదేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు

మునగపాక : అమరవీరులను ప్రతి ఒక్కరూ గుర్తుకు తెచ్చుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మునగపాక సంపద తయారీ కేంద్రం ఆవరణలో అమరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది బ్రిటిష్ వారిపై చేసిన పోరాటం ఫలితంగా స్వాతంత్య్రం వచ్చిందన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఘన నివాళులు అర్పించాలన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మన్మథరావు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఉపాధిహామీ పథకం ఏపీవో ఎరకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద, వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నునపర్తి గ్రామంలో నా భూమి - నా దేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీరుల సేవలను గుర్తు చేసుకొని, వారికి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సిద్ధికి ఎందరో మహానుభావులు చేసిన త్యాగాలు వృథాగా పోరాదని, అందరూ సమానత్వంతో వృద్ధి చెందాలని సర్పంచ్ చుక్కా అనురాధ అన్నారు. పైడిరాజు,ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

కోటవురట్ల: పర్యావరణ పరిక్షణకు మొక్కలు నాటి మహనీయులను స్మరించుకోవడం గర్వకారణమని ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు అన్నారు. మండలంలోని రామచంద్రపాలెం, టి.జగ్గంపేట, వందూరు, రామచంద్రపురం, బోడపాలెం, గొట్టివాడ, చౌడువాడ, నీలిగుంట, రాజుపేట గ్రామాలలో నాభూమి–నాదేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శిలాఫలకంపై స్వాతంత్ర్య పోరాట యోధుల పేర్లు ఏర్పాటు చేసి మహనీయుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశభక్తిని చాటుకోవాలి



మూలపేటలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు తదితరులు

మునగపాక : ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. స్వాతంత్య్ర దినోత్సవాల్లో భాగంగా ఆయన సోమవారం మూలపేటలో జాతీయ జెండాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది త్యాగధనుల పోరాటం ఫలితంగా స్వాతంత్య్రం సిద్ధించిందన్నారు. జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ మంగళవారం ఇంటిపై ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, మొల్లేటి గోవిందరావు, యల్లపు హైమావతి, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ ఆదికుమార్, పెద్దలు కాండ్రేగుల నాగేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ మోహనరావు, గృహ సారథులు మొల్లేటి పరమేశ్వరరావు, ఆడారి జ్యోతి, పార్వతి పాల్గొన్నారు.

విద్యుత్ లేక సాగునీటి మోటార్ల మూగనోము



మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఎస్.రాయవరం : పి.ధర్మవరంలో ఓ ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు గురికావడంతో సాగునీరు నిలిచిపోయిందని రైతులు సోమవారం తెలిపారు. కర్రి వారి పొలం వైపు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ 25 రోజులుగా పని చేయడం లేదని, ఫిర్యాదు చేసినా లైన్‌మెన్ పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ ప్రాంతంలో ఈ సమస్య కారణంగా వ్యవసాయ మోటార్ల నుంచి నీరు రాక పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. కొన్ని పొలాల్లో వరి నాట్లు కూడా నిలిచిపోయాయని తెలిపారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

మునగపాక : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రకాశరావు హెచ్చరించారు. మూలపేట పంచాయతీ శివారు గంగాదేవిపేటలో చెరువు చుట్టూ ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించారంటూ అందిన ఫిర్యాదు మేరకు సోమవారం రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పొక్లెయిన్‌తో ఇళ్ల తొలగింపునకు చర్యలు చేపట్టారు. దీంతో కొంతమంది స్వతహాగా స్థలం ఖాళీ చేయగా మిగిలిన వారు కొంత గడువు కావాలని అడగడంతో వారికి అధికారులు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందడి



గొల్లపేటలో ఎంపీపీ స్కూల్‌లో కబడ్డీ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

కోటవురట్ల: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలు సిద్ధమయ్యాయి. మంగళవారం ఉదయం జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి మహనీయులను స్మరించుటామని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. పలు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆటలు పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కోటవురట్ల శివారు గొల్లపేట ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు కబడ్డీ, మ్యూజికల్ చైర్, ఖోఖో, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించినట్టు హెచ్ఎం జీవన్ తెలిపారు.

నేడు గ్రామీణ యువజన మందిరం వార్షికోత్సవం

రెండు నాటికల ప్రదర్శన



మునగపాకలోని నందీశ్వర ప్రాంగణం తులసీవేదిక

మునగపాక : గ్రామీణ యువజన మందిరం 57వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు మందిర అధ్యక్ష , కార్యదర్శులు ఆడారి గంగమహేష్, ఆడారి సోమశేఖర్ సంయుక్తంగా తెలిపారు. స్థానిక నందీశ్వర తులసీ వేదికపై రాత్రి రెండు నాటికల ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన సిరిమువ్వ కల్చరల్స్ వారి 'కొరడా' నాటిక ప్రదర్శన రాత్రి 7.30 గంటలకు ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ నాటికకు శ్రీ మంజునాథ రచన, దర్శకత్వం అందిస్తారన్నారు. రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ వారు 'హక్కు' నాటిక ప్రదర్శిస్తారు. ఈ నాటికకు మునగపాకకు చెందిన ఆడారి సోమశేఖర్ రచన అందించగా శ్రీ మంజునాథ దర్శకత్వం వహిస్తారన్నారు. కళాకారులను ప్రోత్సహించడంలో భాగంగా నాటికల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కళాభిమానులు పెద్దసంఖ్యలో హాజరై నాటిక ప్రదర్శనలను తిలకించాలని వారు కోరుతున్నారు.

వార్డు మెంబరుగా లోవతల్లి ఏకగ్రీవం

రాంబిల్లి : కుమ్మరాపల్లి పంచాయతీ వార్డు మెంబరుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు బి.లోవతల్లి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారంతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. లోవతల్లి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జరిగిందని ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు తెలిపారు.

కొప్పుగొండుపాలెంలో రెండు వార్డుమెంబర్ల స్థానాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదన్నారు. ఇవి రెండు ఎస్టీ కేటగిరి కాగా ఈ పంచాయతీలో ఎస్టీ ఓటర్లు లేకపోవడంతో చాలా ఏళ్లుగా ఈ వార్డు సభ్యుల స్థానాలకు సభ్యులు లేకుండా పోతున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

మెలిపాక వార్డుకు ముగ్గురు అభ్యర్థులు

మునగపాక : మండలంలోని మెలిపాక వార్డు సభ్యుని ఉప ఎన్నికకు ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. గతంలో వార్డు సభ్యునిగా పనిచేసిన వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందడంతో ఎన్నిక అనివార్యమైంది. వైఎస్సార్‌సీపీ మద్దతుతో గుల్లా అమర వెంకట సత్యనారాయణ, బొల్లం లోవరాజు టీడీపీ మద్దతు అభ్యర్థిగా, నందికోళ్ల రాము జనసేన మద్దతుతో బరిలో ఉన్నారని ఎన్నికల అధికారి రాజు తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయింది. ఈనెల 19న ఉప ఎన్నిక జరగనుందని, అదేరోజు కౌంటింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.

కొరుప్రోలులో..

ఎస్.రాయవరం : కొరుప్రోలు సర్పంచ్ ఉప ఎన్నికకు రెండే నామినేషన్లు ఉన్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటనారాయణ తెలిపారు. సర్పంచ్ పోటీకి అభ్యర్థుల నుంచి ఐదు నామినేషన్లు వచ్చినప్పటికీ సోమవారం విత్‌డ్రాలకు చివరి తేదీ కావడంతో పోటీలో లేనివారు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో పోలవరపు హేమ, కర్రి సూర్యవేణి పోటీలో ఉన్నట్టు చెప్పారు. ఈ నెల 19న ఉప ఎన్నిక ఉంటుందన్నారు.

ముత్యాలమ్మపాలెం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పరవాడ: పలు ఆరోపణల నేపథ్యంలో మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.సోమినాయుడును సస్పెండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటి పన్నులు వేయిస్తానని చెప్పి గ్రామంలో పలువురి నుంచి డబ్బులు వసూలు చే శారని గ్రామానికి చెందిన బొంది దుర్గాలు అనే వ్యక్తి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ జహ్నవి విచారణ జరిపారు. సదరు విచారణలో పంచాయతీ కార్యదర్శి సోమినాయుడు లంచం కాదని.. పలువురు డబ్బులు ఇస్తే తీసుకున్నానని చెప్పడంతో సోమినాయుడుపై చర్యలు కోసం జేసీ జాహ్నవి నివేదిక కలెక్టర్‌కు సమర్పించారు. జేసీ నివేదిక ఆధారంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పంచాయతీ కార్యదర్శి సోమినాయుడును సస్పెండ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పర్యటన

మునగపాక : స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా యలమంచిలి ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) మంగళవారం మునగపాకలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు మండల పరిషత్ కార్యాలయం అలాగే రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగే పతాకావిష్కరణలో ఆయన పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు పాల్గొనే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని అచ్చియ్యనాయుడు కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



రాజయ్యపేట పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో సోమవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రాణాలర్పించిన అమర జీవులు, మహాను భావులు చేసిన త్యాగాలు, పోరాటాలను స్మరిస్తూ విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించడం జరిగిందని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



ప్రతిభ చూపిన స్కే మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు

తుమ్మపాల: ఈ నెల 13న శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు చెందిన స్కే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులు సిల్వర్ పతకాలు సాధించినట్లు ప్రెసిడెంట్ వనం సన్యాసిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన ఎస్.కార్తీక్, జి.మోహనఅర్జున్, కళ్యాణ్‌రాజ్‌లు సిల్వర్ మెడల్, ఎ.కుమార్‌నాయుడు, కె.వంశీ, పి.అరుణ్‌కుమార్, బి.లోహిత, కె.జాయిబాబు, ఎస్.ప్రసాద్, కె.హర్షవర్ధన్, ఆర్.జ్యోతిక్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. వారిని అసోసియేషన్ సభ్యులు వై.రాజు, జి.దేవీవరలక్ష్మి, రమేష్, ప్రసాద్, షిమోన్‌లు అభినందించారు.

కాంప్లెక్స్ మీదుగా బస్సుల్ని నడపాలని వినతి



ఆర్టీసీ జిల్లా అధికారి పద్మావతికి వినతిపత్రం అందిస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్: జిల్లా ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలంటూ జిల్లా అధికారి కె.పద్మావతికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా వెళ్లే అన్ని బస్సులను అనకాపల్లి కాంప్లెక్స్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ–అనకాపల్లి సీటీ జనరల్ బస్‌పాస్‌లు ఇవ్వాలని, కాంప్లెక్స్ ఆవరణలో కుర్చీలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిప్రతం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్ గుప్తా, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణ మోహన్‌రావు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బుగిడి నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం జగనన్న ఘనతే



తిమ్మాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మేజర్ గ్రామ పంచాయితీ తిమ్మాపురం గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు కలిసి కరపత్రాలు అందజేసి వాటి ప్రకారం సంక్షేమ పథకాలు అందుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మారు మూలన ఉన్నవారికి సహితం జగనన్న గ్రామ వలంటీర్ ద్వారా సమాచారం చేరవేసి ప్రభుత్వ పథకాలు అందజేశారని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ మండలపార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వాకపాడు సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం నానాజీ, బొడా శ్రీనివాసరావు, దివాణం, ఐకేపీ ఏపీఎం శివప్రసాద్, ఏపీవో సత్యవతి పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ



కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్లు గుప్తా, బెజవాడ నాగేశ్వరావు

యలమంచిలి : గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం ద్వారా ప్రజా సమస్యలు నేరుగా పరిష్కరించడానికి ఎంతో దోహదపడిందని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణం కోర్టుపేటవీధిలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోర్టుపేట వీధిలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పర్యటించినపుడు కల్వర్టు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణం స్పందించి నిధుల మంజూరుకు అధికారులకు సూచించారన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ కల్వర్టు నిర్మాణానికి కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేయడంతో నిధులు మంజూరయ్యాయన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయంలో పట్టణంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో పట్టణంలో కల్వర్టులు, మురుగుకాల్వల నిర్మాణం,చెరువుల అభివృద్ధి జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ధ్రువపత్రాల మంజూరు



అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో అర్హులైన వారికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా మంజూరైన పత్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా 11 రకాల సేవలు అందాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పాలకవర్గం పాటుపడుతుందన్నారు.